కాలనీలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


ఎమ్మెల్యే గాంధీతో మొగులమ్మ బస్తీ వాసులు

మియాపూర్, మే 30 : సమస్యలను దశల వారీగా పరిష్కరించి కాలనీలకు అండగా నిలుస్తానని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. మౌలిక వసతుల పరంగా ప్రజల భాగస్వామ్యంతో వాటిని పురోగతి వైపు నడిపిస్తానని హామీ ఇచ్చారు. ఆల్విన్ కాలనీ డివిజన్ మొగులమ్మ బస్తీ కాలనీలో నెలకొన్న సమస్యలతో పాటు చేపట్టవలసిన అభివృద్ధి పనులపై కాలనీ వాసులు ఎమ్మెల్యే గాంధీని గురువారం ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ..కాలనీలో తాగునీటి సరఫరాను మరింతగా మెరుగుపరిచేలా కృషి చేస్తానన్నారు. తక్షణమే సంబంధిత అధికారులతో చర్చించి సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ కింద తగినన్ని రిజర్వాయర్లతో పాటు ప్రతి కాలనీకి పైపులైన్లను విస్తరించినట్లు ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. ఆ వ్యవస్థను సమర్థంగా కొనసాగించి ప్రజలకు తాగునీటి పరంగా ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కాలనీలన్నింటా తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్ వంటి పూర్తి స్థాయి మౌలిక వసతులను కల్పించేందుకు ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఒలింపిక్ జాయింట్ సెక్రటరీ బరిలో కొండా

నామినేషన్ దాఖలు చేస్తున్న తెలంగాణ హకీ అధ్యక్షుడు కొండా విజయ్

మాదాపూర్, మే 30: తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ బరిలో తెలంగాణ హకీ అధ్యక్షుడు, చందానగర్ నివాసి కొండా విజయ్‌కుమార్ ఉన్నారు. ఫతే మైదాన్ తెలంగాణ ఒలింపిక్ భవన్‌లో ఎన్నికల అధికారికి గురువారం నామినేషన్‌ను దాఖలు చేశారు. జూన్ తెలంగాణ ఒలింపిక్ భవన్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న ప్యానెల్ నుంచి కొండా విజయ్ కుమార్ పోటీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా తనకు అవకాశం వస్తే రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తనదైన వైలిలో కృషి చేస్తానని తెలంగాణ హకీ అధ్యక్షుడు కొండా విజయ్ తెలిపారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

మేడ్చల్ కలెక్టరేట్, మే 30 : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో గురువారం సమావేశ మందిరాన్ని అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య ప్రారంభించారు. ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖకు సంబంధించిన శిక్షణా కార్యక్రమాలు, సమీక్షా సమావేశాల నిర్వహణ కోసం ఈ సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేశారు. సమావేశ మందిరాన్ని ప్రారంభించిన అనంతరం అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య బీసీజీ టీకాపై జిల్లా స్థాయి క్యాస్కేట్ శిక్షణకు హాజరైన వైద్య అధికారులు, పారా మెడికల్ సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. విధులను శ్రద్ధగా నిర్వహించాలని, క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

కుటుంబసభ్యులతో కలిసి పూజల్లో పాల్గొన్న వంశీమోహన్‌రెడ్డి, గూడూరి చెన్నారెడ్డి

అల్లాపూర్,మే30;ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి అన్నారు.హేమావతినగర్ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో శివాలయం అవరణలో గత నెల దాతలు వంశీమోహన్‌రెడ్డి(డిఎస్‌పి) శ్రీమతి శోభారెడ్డి,మాస్టర్ కనిష్క,లీలా వంశీరెడ్డి కుటుంబసభ్యులు నూతన ధ్వజస్తంభం ప్రతిష్టించారు.ఇందులో భాగంగా గురువారం వంశీమోహన్‌రెడ్డి ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగును తొడిగించి కుంటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న గూడూరి చెన్నారెడ్డి, మాట్లాడుతూ...శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి ప్రత్యేక చొరవ చూపిన దాతలు వంశీమోహన్ రెడ్డి కృషి అభినందనీయమన్నారు.కార్యక్రమంలో పూజారులు భీమేశ్వర శర్మ,నితిన్ శర్మ,డాక్టర్ గూడూరి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం

షాపూర్‌నగర్‌లోని రైతు బజార్‌వద్ద సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్, కార్మికులు

దుండిగల్, మే 30: సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, షాపూర్‌నగర్ రైతుబజార్ వద్ద సీఐటీయూ జెండాను ఆ పార్టీ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1970 మే 30న భారతదేశంలో ఐక్యత పోరాటం అనే నినాదంతో సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. నాటి నుంచి నేటి వరకు దేశంలో ఉన్న అన్ని రకాల, రంగాల కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం, హక్కుల కోసం పోరాటం చేస్తుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా కండువా, జెండా మారుతుందే తప్పా కార్మికులు, పేదల జీవితాలు మారడం లేదన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి పోరాడి సాధించుకున్న హక్కులను, చట్టాలను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కమిటీ సభ్యులు దేవదానం,పసుల అంజయ్య, బి.సత్యం, కరుణాకర్, కే.శీను, మల్లారెడ్డి, బీరయ్య, తిమ్మప్ప, నర్సింహులు, కనకయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ డబుల్స్ చాంపియన్స్‌గా వెంకటనారాయణమూర్తి, రికిమ్‌బస్‌ల జోడీ

కేపీహెచ్‌బీ కాలనీ, మే 30 : ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్ మాస్టర్స్ (400) సిరీస్ చాంపియన్స్ పోటీల్లో 50+ కేటగిరి డబుల్స్ విభాగంలో తెలంగాణ రాష్ట్రానికి కె.వెంకటనారాయణమూర్తి (కేపీహెచ్‌బీ కాలనీ), రికిమ్‌బస్(ఫ్రాన్స్)ల జోడీ ఇంటర్నేషనల్ టెన్నిస్ ప్రపంచ చాంపియన్స్‌గా నిలిచారు. థాయిలాండ్ దేశం పట్టాయనగరంలోని గ్రేటా స్పోర్ట్స్ క్లబ్‌లో ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు వివిధ కేటగిరీలలో చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. గురువారం జరిగిన 50+కేటగిరి డబుల్స్ ఫైనల్స్ పోటీల్లో కెనడాకు చెందిన వ్రాంగ్, ఇండియాకు చెందిన రాందాస్ బలాన్‌ల జోడీపై కె.నారాయణమూర్తి, రికిమ్‌బస్‌ల జోడీ 6-2, 6-1 వరుస సెట్లను కైవసం చేసుకుని.. విజేతలుగా నిలిచి వరల్డ్ చాంపియన్ టైటిల్‌ను అందుకున్నారు.

టైటిల్‌ను అందుకుంటున్న కె.వెంకటనారాయణమూర్తి (కేపీహెచ్‌బీ కాలనీ), రికిమ్‌బస్ (ఫ్రాన్స్)ల జోడీ

ఐలా స్థలాన్ని కమ్యూనిటీహాల్‌కు కేటాయించేందుకు కృషి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


ఐలా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు. చిత్రంలో కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

బాలానగర్, మే 30: ఫతేనగర్ డివిజన్ పరిధి కూకట్‌పల్లి నాలాకు సమీపంలోని ఐలా స్థలాన్ని స్థానికుల విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీ హాల్‌కు కేటాయించడానికి కృషి చేయనున్నట్లు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం ఫతేనగర్ డివిజన్ పరిధి శివాలయం బస్తీని ఆనుకొని ఉన్న ఐలా స్థలాన్ని స్థానిక కార్పొరేటర్ సతీశ్‌గౌడ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫతేనగర్ టు భరత్ నగర్ రహదారిలో రిటైనింగ్ వాల్ నిర్మించడం వలన తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రహదారికి సమీపంలో నిరుపయోగంగా ఐలా స్థలాన్ని ప్రజా అవసరాల కోసం వినియోగించేందుకు సంబంధిత అధికారులతో చర్చిస్తామన్నారు. జన నివాసాలకు సమీపంలో ఉన్న ఐలా స్థలాలను ప్రజా అవసరాలకు వినియోగించుకునేందుకు అధికారులు కూడా సానుకూలంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కురుమయ్య, ఎర్ర నరసయ్య, డేవిడ్, సురేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాసిరెడ్డి వాసు కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తల్లి విజయను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 30:రాష్ట్ర హౌసింగ్ ఉద్యోగి, కేపీహెచ్‌బీ కాలనీ నివాసి వాసిరెడ్డి వాసు తల్లి వాసిరెడ్డి లీలాకుమారి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం కేపీహెచ్‌బీ కాలనీలోని వాసిరెడ్డి వాసు నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే కృష్ణారావు వాసిరెడ్డి లీలా కుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీష్ అరోరా, అమిర్నెని సత్యనారాయణ, రాజేశ్‌రాయ్ తదితరులు ఉన్నారు.

కార్యకర్త తల్లిని పరామర్శించిన ఎమ్మెల్యే

కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షుడు పుచ్చకాయల కిరణ్‌కుమార్ తల్లి అనారోగ్యంతో కూకట్‌పల్లి అమోర్ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా.. గురువారం ఎమ్మెల్యే కృష్ణారావు కార్యకర్త తల్లి విజయను పరామర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కిరణ్‌కుమార్‌కు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సతీశ్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నేతలు ఉన్నారు.

తెలంగాణ ఆవిర్భావ ఏర్పాట్లు పరిశీలన

జూన్ 2వ తేదీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించేందుకు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజాప్రతినిధులు, నేతలు సమాయత్తం అవుతున్నారు. అటు బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ సైతం మూడు రోజులపాటు దశాబ్ది ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో గురువారం ప్రగతినగర్‌లోని మూడు కోతుల బొమ్మల చౌరాస్తా వద్ద ఉన్న 'తెలంగాణ అమరవీరుల స్థూపం' వద్ద నేతలు ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలతోపాటు తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజు యాదవ్, కార్పొరేటర్ బాలాజీనాయక్, ఉద్యమ నాయకులు మంగీలాల్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ నిజాంపేట్ కార్పొరేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సాంబశివారెడ్డి, వ డివిజన్ అధ్యక్షులు స్టాలిన్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లను పరిశీలించిన వారిలో ఉన్నారు. *– దుండిగల్, మే 30*

రోడ్డు ఆక్రమించిన యజమానిపై చర్యలు తీసుకోవాలి

ఆక్రమణకు గురైన స్థలం ఇదే..

దుండిగల్,మే 30 :హెచ్‌ఎండీఏ అనుమతుల పేరుతో రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న భవనం యజమానిపై చర్యలు తీసుకోవాలంటూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ నేత, ప్రగతినగర్ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ చల్లా సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామకృష్ణ, టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారి ప్రశాంతిలను కలిసి సదరు నిర్మాణంపై చర్యలు తీసుకునేందుకు ఎందుకు వెనకడుగు వేస్తున్నారో తెలుపాలంటూ నిలదీశారు. నిజాంపేట్ కార్పొరేషన్, ప్రగతినగర్‌లోని పట్టాభిరామాంజనేయ దేవస్థానం ఎదుట ఓ బిల్డర్ 30 ఫీట్ల రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నాడని, ఈ విషయంలో తాను ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎందుకు స్పందించడంలేదో తెలుపాలన్నారు. పంచాయతీగా ఉన్న సమయంలో సదరు స్థలాన్ని పార్కు లేదా పాఠశాల నిర్మాణం కోసం కేటాయించారని, తదనంతరం ఇండ్ల స్థలాలకు డిమాండ్ పెరుగడంతో తప్పుడు లే అవుట్లు సృష్టించి హెచ్‌ఎండీఏ నుంచిడి అనుమతులు పొందారని పేర్కొన్న ఆయన స్థానిక మున్సిపల్ అధికారులు క్షత్రస్థాయి పరిశీలన జరుపకుండానే ఎలా అప్రూవల్ ఇచ్చారని ప్రశ్నించారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపి రోడ్డుస్థలాన్ని కాపాడాలని,అదే విధంగా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. హెచ్‌ఎండీఏ అధికారులకు ఫిర్యాదు చేశామని, అధికారులు స్పందించని పక్షంలో న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సైట్‌కు సంబంధించిన అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయన్నారు. అదే విధంగా ప్రగతినగర్‌లోని 13 పార్కుల్లో వెలసిన నిర్మాణాలను గుర్తించాలని కోరారు. స్పందించిన కమిషనర్ దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

3న ఉచిత చెవి వైద్య శిబిరం

మేడ్చల్, మే 30 : మేడ్చల్ పట్టణంలోని ఆదిత్య హాస్పిటల్ ఆధ్వర్యంలో వచ్చే 3, 4 తేదీల్లో ఉచిత వినికిడి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు ఆస్పత్రి డాక్టర్ కిశోర్ తెలిపారు. రెండు రోజుల పాటు ఉదయం 10నుంచి సాయంత్రం 8 గంటల వరకు వైద్యశిబిరం ఉంటుందన్నారు. వినికిడి లో పం ఉన్న వారికి అత్యాధునిక పరికరాల తో పరీక్షలు నిర్వహిస్తామని, వినికిడి లోపంతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

చెత్త తొలగింపుపై ప్రజలకు అవగాహన

- **జీవీపీలను తొలగిస్తూ.. ఆటపాటలతో వేడుకలు**

కూకట్‌పల్లి సర్కిల్‌లో తొలగించిన జీవీపీలలో క్యారమ్, చేస్ ఆటలు ఆడుతున్న పారిశుధ్య కార్మికులు, చిన్నారులు, యువకులు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 30: కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలో తరుచుగా చెత్త వేసే ప్రాంతాలు గార్బేజీ వనరేబుల్ పాయింట్ (జీవీపీలు)లను తొలగించేందుకు పారిశుధ్య విభాగం చేపట్టిన వినూత్న కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. జంట సర్కిళ్ల పరిధిలో 234 జీవీపీలు ఉండగా... ఇప్పటి వరకు 205 జీవీపీలను తొలగించగా.. ఇంకా తొలగించాల్సినవి 29 ఉన్నాయి. మూసాపేట సర్కిల్‌లో 162 జీవీపీలు ఉండగా.. 147 తొలగించగా.. ఇంకా 15 తొలగించాల్సి ఉన్నాయి. అలాగే కూకట్‌పల్లి సర్కిల్‌లో 72 జీవీపీలు ఉండగా... 58 తొలగించగా, ఇంకా తొలగించాల్సినవి 14 ఉన్నాయి. ఈ జీవీపీలన్నింటిని తొలగించమే లక్ష్యంగా జీహెచ్‌ఎంసీ గత కొద్దికాలంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నది. సర్కిళ్ల పరిధిలోని కాలనీలు, బస్తీల వారీగా ప్రత్యేక బృందాలతో సర్వేతోపాటు ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అసోసియేషన్ నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. సమస్యాత్మకంగా మారిన జీవీపీలను గుర్తించి.. చెత్తాచెదారాన్ని తొలగించి పరిశుభ్రంగా మార్చుతున్నారు. మరల ఆ ప్రాంతంలో చెత్త వేయకుండా రంగురంగుల ముగ్గులు వేస్తున్నారు. ఆ ప్రాంతాల్లో శాశ్వతంగా చెత్తాచెదారం వేయకుండా ఉండేందుకు పూలు, పచ్చని మొక్కలు నాటుతూ గ్రీనరీని అభివృద్ధి చేస్తున్నారు. తాజాగా.. ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు జీవీపీలను తొలగించిన ప్రాంతాల్లో జన్మదినానికి సంబంధిన కేక్‌లను కట్‌చేస్తున్నారు. పరిశుభ్రంగా మారిన జీవీపీ పాయింట్లలో పారిశుధ్య కార్మికులు, స్థానికులతో కలిసి క్యారమ్, చెస్ లాంటి ఆటలు ఆడుతున్నారు. ఇన్నాళ్లు చెత్తాచెదారంతో మురికికూపంగా ఉండే జీవీపీ ప్రాంతాలు పరిశుభ్రంగా మారడం... ఆ ప్రాంతాల్లో ఆటపాటలు.. హ్యాపీబర్త్‌డే అంటూ వేడుకలు జరుపుతుండంతో ప్రజలంతా జీహెచ్‌ఎంసీ చేస్తున్న కృషిని హర్షిస్తున్నారు. కార్యక్రమాలతో ప్రజల్లో అవగాహన పెరుగుతుందని, ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన వచ్చినప్పుడే సంపూర్ణ స్వచ్ఛతను సాధించడం సాధ్యమవుతుందని అధికారులు చెబుతున్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 30 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో గురువారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) క్రింది విధంగా ఉన్నాయి. టమాట 29, వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 50, బజ్జి మిర్చి 50, కాకరకాయ 45, బీరకాయ 35, క్యాబేజి 16, ఫ్రెంచ్ బీన్స్ 125, క్యారెట్ 40, కాలీఫ్లవర్ 18, దొండ 23, చిక్కుడు 75, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 17, క్యాప్సికం 50, ఆలుగడ్డ 32, కీరా 18, దోసకాయ 23, సొరకాయ11, పొట్లకాయ (1) 18, కందగడ్డ 65, ఉల్లిపొరక 75, ఉల్లిగడ్డ 26, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 40, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 23, గుమ్మడికాయ 35, నిమ్మకాయలు(12) 65 నుంచి 75, మునగకాయ(1) 4 నుంచి 5, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 240, చింతపండు 120, పండుమిర్చి 80 గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.



చిహ్నాలు తొలగిస్తే.. తిరుగుబాటు తప్పదు

బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

బాలానగర్, మే 30: తెలంగాణ రాజ ముద్రలో నుంచి ఓరుగల్లు కాకతీయుల కళా తోరణం, చార్మినార్ చిత్రాలను తొలగించే ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని, లేని పక్షంలో మరో ఉద్యమానికి తెరతీయక తప్పదని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొనని సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ చారిత్రక ఆనవాళ్లను చెరిపివేసే కుట్ర చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు. తెలంగాణ రాజ ముద్రలో నుంచి కాకతీయుల కళాతోరణం, చార్మినార్ చిత్రాలను తొలగిస్తే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు.

ఫ్యాషన్ రంగంలో ప్రఖ్యాతిగాంచిన న్యూమీ బ్రాండ్ తమ స్టోర్‌ను గురువారం కొండాపూర్‌లోని శరత్‌సిటీ క్యాపిటల్ మాల్‌లో ప్రారంభించింది. న్యూమీ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు సుమిత్ జసోరియా ముఖ్య అతిథిగా హాజరై స్టోర్‌ను ప్రారంభించారు. త్వరలోనే నగరంలో 15 నుంచి 20 కొత్త స్టోర్‌లను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. *– కొండాపూర్, మే 30*

జగద్గిరిగుట్ట ఠాణా పరిధిలో నాకాబందీ

జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధి ఎల్లమ్మబండ సమీపం పీజేఆర్‌నగర్‌లో గురువారంరాత్రి బాలానగర్ ఏసీపీ హనుమంతరావు నేతృత్వంలో గురువారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని వివరాలు సేకరించారు. సరైన పత్రాలు లేని వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్, పలు స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు. *– జగద్గిరిగుట్ట, మే 30*